బోర్డు అధ్యక్షుడికి సిబ్బంది వీడ్కోలు



బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ నంజుండేశ్వరకు వీడ్కోలుకు పలుకుతున్న బోర్డు సిబ్బంది

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ అధ్యక్షుడు, సికింద్రాబాద్ మిలటరీ స్టేషన్ డిప్యూటీ జీఓసీ, బ్రిగేడియర్ నంజుండేశ్వర బదిలీపై వెళ్లారు. ఉగాండాలో నిర్వహించే భారత సైనిక సేవల్లో పాల్గొనేందుకు ఆ దేశానికి వెళ్లనున్న బ్రిగేడియర్‌కు బోర్డు సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. సీఈఓ మధుకర్ నాయక్, జాయింట్ సీఈఓ పల్లవి విజయ్ వన్షీ, బోర్డు సభ్యురాలు భానుక నర్మదతో పాటు ఓఎస్ యానీ, సీనియర్ ఇంజనీర్లు ఉమాశంకర్, ఫణికుమార్, హెల్త్, శానిటేషన్, వాటర్‌వర్క్స్, అకౌంట్స్ విభాగాల సూపరింటెండెంట్‌లు దేవేందర్, మహేందర్, రాజ్‌కుమార్, రమణ తదితరులు బ్రిగేడియర్‌కు వీడ్కోలు పలికారు. కంటోన్మెంట్ బోర్డు నూతన అధ్యక్షుడిగా బ్రిగేడియర్ రాజీవ్ నియమితులయ్యారు.

నివాళి



లాలాపేట: సికింద్రాబాద్ నియోజకవర్గం శాంతినగర్‌కు చెందిన ప్రముఖ మహిళా నాయకురాలు రమణమ్మ(70) వృద్ధాప్యం కారణంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఈ మేరకు మంగళవారం శాంతినగర్‌లోని ఆమె నివాసం వద్ద స్థానిక ప్రజల సందర్శనార్థం ఉంచిన రమణమ్మ భౌతికఖాయం వద్ద బీజేపీ రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి వీరన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, బీఆర్ఎస్ నేతలు లింగాని శ్రీనివాస్, కుమార్ వంశరాజ్, కిరణ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, చంద్రశేఖర్ వివిధ రాజకీయ పార్టీల నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. శేషాపహాడ్‌లోని సత్యహరిశ్చంద్ర శ్మశానవాటికలో రమణమ్మ అంత్యక్రియలు జరిగాయి. వివిధ పార్టీలకు చెందిన నాయకులు హాజరయ్యారు.

విలీన ప్రక్రియపై తేల్చండి



కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీలో విలీనం చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేశ్, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ కె.రామకృష్ణారావుకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం సెక్రెటేరియట్‌లో చీఫ్ సెక్రెటరీని మర్యాదపూర్వకంగా కలిశారు. జీహెచ్‌ఎంసీలో విలీనాన్ని సాకుగా చూపుతూ రక్షణశాఖ అధికారులు బోర్డు ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. విలీన ప్రక్రియ జాప్యం అయ్యే విధంగా ఉంటే, ఎన్నికల నిర్వహించేలా రక్షణ అధికారులపై ఒత్తిడి తెస్తామన్నారు. ఈ అంశంపై త్వరలోనే స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్యే శ్రీగణేశ్ చీఫ్ సెక్రెటరీని కోరారు.

యూనివర్సిటీ చిత్రాన్ని ఆదరించండి

ఓయూలో ఆర్.నారాయణ మూర్తి



ఉస్మానియా యూనివర్సిటీ: యూనివర్సిటీ చిత్రాన్ని ఆదరించాలని సినీ దర్శకులు, విప్లవ నటుడు ఆర్.నారాయణమూర్తి విద్యార్థులను కోరారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీకి విచ్చేసిన ఆయన వామపక్ష, దళిత విద్యార్థి సంఘాల నాయకులతో మంగళవారం సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను ఇతివృత్తంగా తీసిన యూనివర్సిటీ చిత్రాన్ని ప్రతి విద్యార్థి చూడాలని, ఇతరులను కూడా చూడాలని చెప్పాలని కోరారు. కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో చిన్నారులకు పౌష్టికాహారం

లాలాపేట: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని శాంతినగర్ అంగన్‌వాడీ సెంటర్ టీచర్ చంద్రమణి అన్నారు. ఈ మేరకు అమ్మ మాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా చిన్నారులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ప్రైవేట్ వద్దు.. అంగన్‌వాడీ ముద్దు అంటూ ర్యాలీలో నినాదాలు చేశారు. రెండున్న సంవత్సరాల నుంచి 6 ఏళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. ఇక్కడ ఆటా పాటలతో ప్రీస్కూల్ విద్యను బోధిస్తామని పేర్కొన్నారు. పిల్లలకు పౌష్టికాహారం కూడా అందజేస్తామన్నారు. అనంతరం పలువురు చిన్నారులకు అన్నప్రాసన జరిపించారు.

అడ్డగోలు పార్కింగ్‌తో అవస్థలు

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- మైనర్ డ్రైవింగ్‌పై పోలీసులు నిఘా పెట్టాలి
- పట్టించుకునే వారు కరువయ్యారు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు



తుకారాంగేట్ సుభాష్ విగ్రహం వద్ద రోడ్లపై పార్క్ చేసిన ఆటోలు

అడ్డగుట్ట: ఆటో వాలాలు ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తుండటంతో స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తమ దుకాణాలకు వచ్చే కొనుగోలుదారులకు సైతం నడవడానికి వీలు లేకుండా ఉండే విధంగా ఆటోలు పార్కింగ్ చేస్తూ అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని స్థానిక దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా బస్సుల రాకపోకలకు కూడా ఈ ఆటోల పార్కింగ్ ద్వారా అంతరాయం ఏర్పడుతోందని అడ్డగుట్ట డివిజన్ తుకారాంగేట్‌లోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే అడ్డగుట్టకు బస్సులు కరువు అనుకుంటే దానికి తోడు ఈ విధంగా ఆటో వాలాలు కొత్త సమస్యలు సృష్టించడం సరైంది కాదని అంటున్నారు. అంతేకాకుండా పలువురు మైనర్లు సైతం ఆటోలు నడుపుతున్నారు. దీంతో నిత్యం రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాలకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. రోడ్లపై పూర్తిగా ఆటోలు ఉండడంతో ఇతర వాహనాలు వెళ్లడానికి స్థలం కూడా లేకపోయిందని పలువురు ప్రయాణికులు అంటున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందన లేదని అంటున్నారు.

పరిమితికి మించిన ప్యాసింజర్లు



ఆటోవాలాల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదర్కొంటున్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్యాసింజర్లను కూర్చోబెట్టుకొని వెళ్తుంటారు. ఏమాత్రం అదుపు తప్పినా వారి పరిస్థితి ఏమవుతుందోనని కూడా ఆలోచించడం లేదు. రోడ్లకు అడ్డంగా ఆపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు స్పందించాలి.

– ఉదయ్ యాదవ్, బీజేవైఎం నాయకుడు

సమస్యల పరిష్కారానికి కృషి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



హమాల్‌బస్తీలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: ప్రజా సమస్యల పరిష్కారానికి సనత్‌నగర్ సమగ్రాభివృద్ధికి నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్ పరిసర ప్రాంతాల్లో రూ.కోటి ఖర్చుతో చేపడుతున్న పలు ప్రజాభివృద్ధి కార్యక్రమాలను మంగళవారం స్థానిక కార్పొరేటర్ కె.హేమలత, జి.పవన్‌కుమార్ గౌడ్, వెంకటేషన్‌రాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో విస్తతంగా పర్యటించడం ద్వారా ప్రజలు పలు సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తున్నారని చెప్పారు. సదరు సమస్యలను సకాలంలో పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. ప్రజల కనీస సదుపాయాలైన రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం తదితర సమస్యలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు.

◆ హమాల్‌బస్తీలో స్థానిక ప్రజలు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను సమీపించి తమ బస్తీలు మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని, వెంటనే నూతన టాయిలెట్స్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సాయిబాబా దేవాలయం సమీపంలోని ప్రజలు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి తమ డ్రైనేజీ మురికినీటి పారుదల వల్ల ఇబ్బంది పడుతున్నామన్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలు సూచించిన సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ జీహెచ్‌ఎంసీ జలమండలి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డాకునాయక్, ఈఈ సుబ్రహ్మణ్యం, జలమండలి జీఎం వినోద్‌కుమార్‌తో పాటు స్థానిక నాయకులు లక్ష్మీపతి, సురేష్, మహేందర్ గౌడ్, పుష్వంత్ రెడ్డి, హరిచారి, గజ్జెల శ్రీనివాస్, శివప్ప, యాదగిరి, సుభాష్, కుషాల్, శ్యామ్, అనిత తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్, ప్రభుత్వ పాలనా శాస్త్రం రిటైర్డు అధ్యాపకులు డాక్టర్ పి.మోహన్‌రావు మంగళవారం అడిషనల్ డీజీపీ మహేశ్‌భగవత్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర పోలీసు విభాగం పనితీరు గొప్పగా దేశంలోనే నంబర్–1 స్థానంలో ఉండటంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. – లాలాపేట

శరవేగంగా కొనసాగుతున్న పనులు



మార్గదర్శికాలనీలో పర్యటిస్తున్న సీఈవో మధుకర్ నాయక్, నర్మద తదితరులు

రసూల్‌పురా: వర్షాకాలంలో ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద నీరు సాఫీగా ప్యాట్నీ కల్వర్టు ద్వారా దిగువకు వెళ్లేందుకు నాలా పూడికతీత పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు నర్మద తెలిపారు. మంగళవారం రెండవ వార్డు పరిధిలోని మార్గదర్శి కాలనీ, అవంతి కాలనీ, బీహెచ్‌ఈఎల్ కాలనీల్లో బోర్డు శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో కొనసాగుతున్న నాలా పూడికతీత పనులు, ప్యాట్నీ వద్ద హైడ్రా ఆధ్వర్యంలో కొనసాగుతున్న నాలా వెడల్పు పనులను బోర్డు సీఈవో మధుకర్ నాయక్, నర్మద పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలా వెడల్పు పనులు పూర్తయిన అనంతరం బోర్డు నిధులు కేటాయించి నాలాకు ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ సూపరింటెండెంట్ ఎం.దేవేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చౌహాన్, బోర్డు శానిటేషన్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానవాటిక ఆక్రమణలపై ప్రజావాణిలో ఫిర్యాదు



డిప్యూటీ కమిషనర్ డాకు నాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న కురుమ సంఘం నాయకులు

పద్మారావునగర్: సికింద్రాబాద్ బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రూనగర్‌లోని కురుమ కమ్యూనిటీకి సంబంధించిన శ్మశానవాటిక ఆక్రమణలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ డాకు నాయక్‌కు విజ్ఞప్తి చేశారు. సనత్‌నగర్ కురుమ సంఘం ప్రధాన కార్యదర్శి సునీల్ ఆధ్వర్యంలో మంగళవారం నాయకులు శివప్రసాద్, నటరాజ్, శివకుమార్, సంతోష్, దినేష్, రాజశేఖర్, సునీల్, రమేష్ తదితరులు జీహెచ్‌ఎంసీ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. చాచా నెహ్రూనగర్‌లోని కురుమ కమ్యూనిటీకి సంబంధించిన శ్మశానవాటిక ఆక్రమణకు గురై భవన నిర్మాణాలు జరుగుతున్నాయని, వెంటనే దీన్ని పరిరక్షించాలని కోరారు. తమ కమ్యూనిటీ శ్మశానవాటిక కబ్జాకు గురైందని పేర్కొంటూ పలు ఆధారాలతో సంఘం నాయకులు డిప్యూటీ కమిషనర్ డాకు నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. సదరు శ్మశానవాటిక స్థలం పవిత్రతను పరిరక్షించాలన్నారు. ఈ సందర్భంగా సనత్‌నగర్ కురుమ సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.పి.సునీల్, శివప్రసాద్ మాట్లాడుతూ ఆలస్యమైనా తమకు న్యాయం దక్కుంటుదనే నమ్మకం, ఆశ ఉందని చెప్పారు. 1950 సంవత్సరంలో తమ కమ్యూనిటీకి ఈ స్థలాన్ని కేటాయించారన్నారు. కొందరు స్థలాన్ని ఆక్రమించుకొని నిర్మాణాలు చేపడుతున్న విషయాన్ని రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ, హైడ్రా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అధికారులు కబ్జా నుంచి తమ శ్మశానవాటికను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

సంపూర్ణ జీవన విధానం యోగా

ప్రముఖ యోగా గురువు ఓం ప్రకాష్ స్వర్ణ



బన్సీలాల్‌పేట్: యోగా అనేది భారతీయ ప్రాచీన సంప్రదాయాన్ని ప్రతిబింబించే గొప్ప ఆధ్యాత్మిక పరిచయమని, ఇది శరీరాన్ని, మనసును, శ్వాసను, ఆలోచనలను ఒకే దారిలో ఉంచేలా చేస్తుందని ప్రముఖ యోగా గురువు ఓంప్రకాష్ స్వర్ణ అన్నారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని పత్రికా సమాచార కార్యాలయం, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ కార్యాలయాల సంయుక్త ఆధ్వర్యంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కవాడిగూడ ప్రధాన రహదారిలో సీజీఓ టవర్స్ 'మహిళల ఆరోగ్యంపై యోగా ప్రభావం అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓం ప్రకాష్ స్వర్ణ మాట్లాడారు. యోగా అనేది కేవలం వ్యాయామం కాకుండా సంపూర్ణ జీవన విధానంగా పని చేస్తుందని చెప్పారు. యోగా కేవలం శారీరక సాధనమే కాకుండా మానసిక ప్రశాంతతను కూడా అందిస్తుందన్నారు. పీఐబి, సీబీసీ అదనపు డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్, నేచర్ క్యూర్ ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ వైష్ణవి పాల్గొన్నారు.

కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: ఆల్విన్, సంజీవయ్య పార్కు, లోధా, హెచ్‌పీఎస్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు అల్లావుద్దీన్‌కోఠి, ఓల్టాస్, టయోటా షోరూం లేన్, కామత్‌లింగాపూర్, ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్, ప్రకాష్‌నగర్ వాటర్ ట్యాంక్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సనత్‌నగర్ ఇండస్ట్రియల్ ఏరియా, డీ–మార్ట్ ఏరియా, టయోటా షోరూం లేన్, స్కోడా షోరూం లేన్, జెన్ టెక్నాలజీ ఏరియా, ఆంధ్రాబ్యాంక్ లేన్, సూర్యోదయ కాంప్లెక్స్, నల్లి సిల్క్స్ శారీస్ ఏరియా ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

రసూల్‌పురా: సికింద్రాబాద్ డివిజనల్ పరిధిలోని సూర్యఎన్‌క్లేవ్, గన్‌రాక్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో ఫీడర్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ సికింద్రాబాద్ కే.మురళీకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు ఎస్‌పీ కాలనీ, అరుణ్ ఎన్‌క్లేవ్, సూర్యా ఎన్‌క్లేవ్, సాయిబాబా టెంపుల్, దుర్గా వీహార్ కాలనీ, సాయిబాబా హట్స్, చంద్రగిరి కాలనీ ఫేజ్–1, లేక్ విల్లా ఎక్స్‌టెన్షన్ ప్రాంతాలు, అదేవిధంగా మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఐటీబీకాలనీ, దుర్గా విహార్, లాలామీయబస్తీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా 23, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 38, పందిరి బీర 45, క్యాబేజీ 16, క్యారెట్ 40, దొండ 18, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 75, గోకరకాయ 35, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 25, చామగడ్డ 28, మొరంగడ్డ 21, కందగడ్డ 45, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 5–6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

టూరిజం ప్లాజా హోటల్‌లో ఆహార నాణ్యతపై ఆరా

- ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా తీర్చిదిద్దుతాం
- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు ఉంటాయన్న మంత్రి జూపల్లి

సనత్‌నగర్: బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌ను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెస్టారెంట్ అంతా కలియ తిరుగుతూ ఆహార పదార్థాల నాణ్యతతో పాటు కిచెన్‌ను పరిశీలించారు. అల్పాహారం చేస్తున్న పర్యాటకులు, అతిథులతో మంత్రి జూపల్లి మాట్లాడారు. ఆహార నాణ్యత, రుచి గురించి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హరిత హోటల్స్‌లో సౌకర్యాలు, ఆహార నాణ్యతపై నిరంతరం పరిశీలన కొనసాగిస్తామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. పర్యాటకులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాల్సిన బాధ్యత హోటల్స్ నిర్వాహకులపై ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదాయం పెంచడంతో పాటు పర్యాటకులు, అతిథుల కోసం మెరుగైన సౌకర్యాలు, వసతుల కల్పనపై ప్రధానంగా దృష్టి పెడుతున్నామన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా హరిత హోటల్స్‌ను తీర్చిదిద్దుతామని చెప్పారు.



టూరిజం ప్లాజా హోటల్‌లో ఆకస్మిక తనిఖీలు చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు

ఎన్‌డీఏ హయాంలో ఎంతో అభివృద్ధి



మార్కండేయనగర్ పార్కులో మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

రాంగోపాల్‌పేట్: 11 సంవత్సరాల్లో ఎన్‌డీఏ హయాంలో దేశం సర్వతోముఖాభివృద్ధి సాధించిందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీర శ్రీకాంత్ అన్నారు. పాన్‌బజార్‌లోని కార్యాలయంలో ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 11 ఏళ్లలో దేశం అనేక రంగాల్లో అభివృద్ధి చెందిందని చీర శ్రీకాంత్ అన్నారు. మన దేశం జపాన్‌ను అధిగమించి నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని అన్నారు. దేశంలో 81 కోట్ల మంది పేదలకు ఉచిత రేషన్ అందిస్తున్న ఘనత మోదీకే దక్కుతుందన్నారు.



మాట్లాడుతున్న చీర శ్రీకాంత్

మోదీ పాలన పేదల సంక్షేమానికి ప్రతిరూపం

చిలకలగూడ: దేశ ప్రధాని నరేంద్రమోదీ 11 ఏళ్ల పాలన పేదల సంక్షేమం, అభ్యున్నతికి ప్రతిరూపమని పలువురు బీజేపీ నాయకులు కొనియాడారు. వికసిత్ భారత్ అమృత్‌కాల్ సేవ కార్యక్రమంలో భాగంగా సీతాఫల్‌మండి డివిజన్ మార్కండేయనగర్ పార్కులో మంగళవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేకల కీర్తిహర్షకిరణ్, రాజేశ్వర్, ఈవీనరేష్, హన్మంతుముదిరాజ్, రాజుసాగర్, యాదవ్, శారద, నాగవేణి, దేవేందర్ పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు

రాంగోపాల్‌పేట్: విద్యతోనే సమాజంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. రెజిమెంటల్‌బజార్‌లోని హిల్ స్ట్రీట్ పాఠశాలలో మంగళవారం ఆయన విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది అట్టడుగు స్థాయి నుంచి వచ్చి ఉన్నత చదువులు చదివి దేశం గర్వించే స్థాయికి చేరుకున్నారని అన్నారు. అబ్దుల్‌కలాం వంటి వ్యక్తి పేపర్ బాయ్‌లా పనిచేసి దేశ శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంతో కృషి చేశారన్నారు. పేద విద్యార్థులకు ఆర్థికంగా సహకారం అందిస్తూ వారి విద్యాభివృద్ధికి సహకరించేందుకు ప్రతి ఒక్కరూ తమకు చేతనైన సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో అల్లాడి గౌరీశంకర్, ప్రభాకర్‌యాదవ్, నందికంటి రవి, శేఖర్ ముదిరాజ్, శ్రీనివాస్, వైష్ణవి పాల్గొన్నారు.

ఏ స్థాయిలో ఉన్నా క్రమశిక్షణ, సమయపాలన అవసరం



సనత్‌నగర్: అశోక్‌కాలనీలోని ప్రభుత్వ పాఠశాల (సనత్‌నగర్ ఓల్డ్) విద్యార్థులకు బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు విద్యలో రాణించడం ద్వారానే సమాజంలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కెరీర్‌పరంగా కూడా ఉన్నత స్థానానికి చేరుకునేందుకు చిన్నతనం నుంచి ప్రణాళికబద్ధంగా ముందుకుసాగాలన్నారు. ఎక్కడ ఏ స్థాయిలో ఉన్నా క్రమశిక్షణ,సమయపాలన అలవర్చుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందివచ్చే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళా ప్రదర్శన



పద్మారావునగర్: సికింద్రాబాద్ పద్మారావునగర్‌లోని కొత్తా కామకోటి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శన ఆకట్టుకుంటోంది. ప్రదర్శనలో వస్తువులు, దుస్తులు, కళాకృతులు అందుబాటులో ఉండటంతో పెద్దఎత్తున సందర్శకులు వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. చేనేత కళాకారులచే రూపొందిన సిల్క్, కాటన్ వస్త్రాలు వావ్ అనిపిస్తున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, అస్సాం, బీహార్, ఛత్తీస్‌ఘడ్, గుజరాత్, జమ్మూకశ్మీర్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన అనేక కళావస్తువులు, దుస్తులు, చీరలు, ఉడెన్ హ్యాండీక్రాఫ్ట్స్, ప్రింటెడ్ శారీలు, డ్రెస్ మెటీరియల్స్, కోటా, బంధాని, బ్లాక్ ప్రింట్స్, సంగ్నరి ప్రింట్స్, డ్రెస్ మెటీరియల్స్‌ను ప్రదర్శనలో ఉంచారు. హర్యాన బెడ్ కవర్లు, కుషన్ కవర్లు, లక్నో కుర్తీస్, డోర్ కర్టెన్, జైపురి స్టోన్ జువెలరీ, పెరల్స్ తదితర వస్తువులు కళా ప్రదర్శనలో కొలువుదీరాయి. చీరలు, ఇతరత్రా వస్త్రాలపై 60 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు నిర్వాహకులు చెప్పారు.

బేగంపేట పాటిగడ్డలో కార్డెన్‌సెర్చ్



- పత్రాలు లేని 70 వాహనాల స్వాధీనం
- పోలీసుల అదుపులో.. విదేశీ సిగరెట్లు నిల్వ చేసిన వ్యక్తి
- సోదాలో పాల్గొన్న దాదాపు 200 మంది సిబ్బంది

సనత్‌నగర్: కార్డెన్ సెర్చ్‌లో భాగంగా బేగంపేట పాటిగడ్డలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. దాదాపు 200 మంది పోలీసులు మంగళవారం రాత్రి పాటిగడ్డలో తనిఖీలు నిర్వహించారు. నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ పర్యవేక్షణలో బేగంపేట పోలీస్‌స్టేషన్‌తో పాటు నార్త్‌జోన్ పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్ల సిబ్బంది పాల్గొని ఇంటింటి సోదాలు జరిపారు. అనుమానితులను ప్రశ్నించడంతో పాటు వారికి సంబంధించి ధ్రువీకరణ పత్రాలను తనిఖీ చేశారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులు, అనుమానితులైన 11 మందితో వేరుగా సమావేశమై వారి ప్రస్తుత కార్యకలాపాలు, జీవనోపాధికి చేస్తున్న పనుల గురించి ఆరా తీశారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎటువంటి పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 70 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఓ ఇంట్లో మక్బుల్ అనే వ్యక్తి నిల్వ ఉంచిన రూ.4 లక్షల విలువ చేసే విదేశీ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. మాదకద్రవ్యాల కోసం వినియోగించే రోలింగ్ పేపర్లను కూడా అతని వద్ద గుర్తించారు. మక్బుల్‌పై కేసు నమోదు చేసి విచారణ నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ దాడుల్లో అదనపు డీసీపీ అశోక్, ఏసీపీలు గోపాలకృష్ణమూర్తి, సైదయ్యతో పాటు బేగంపేట ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు సహా అన్ని పోలీస్ స్టేషన్లకు చెందిన ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379